# ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ లెవల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్

## (రాజకీయనాయకులకు, దొంగలకు మాత్రమే)

**ఆ** బోర్డ్ చూసి కొంచెం కన్‌ఫ్యూజయ్యాను. అయితే ఎలాంటి షాకులకయినా భారతపౌరుడు అతీతుడు కాబట్టి విషయం ఏమిటో కనుక్కుందామని లోపలకు నడిచాను.

ఓ గుబురుమీసాల ఆసామి విశాలమయిన ఎ.సి. రూమ్‌లో కూర్చుని ఉన్నాడు.

అతని వెనుక గోడకు ఆ గది గోడంత సర్టిఫికెట్ వేలాడుతోంది.

"ఆరువేల నాలుగొందల పధ్నాలుగు దోపిడీలు, దొంగతనాలు, ఇతర చిల్లర నేరాలూ చేసి కూడా పోలీసులకు దొరక్కుండా తప్పించుకొని గిన్నిస్ రికార్డ్‌కెక్కిన సందర్భంలో నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ తీఫ్ శ్రీ గంగారామ్ గారికి ఇచ్చిన గిన్నిస్ దొంగ సర్టిఫికెట్–" అని ఉంది దానిమీద.

"ఆ గంగారామ్‌గారు మీరేనా సార్?" అడిగాను వినయంగా.

"అవును!"

"ఆహా! మీలాంటి గ్రేట్‌గిన్నిస్ హీరోని కలుసుకోవడం వల్ల నా జన్మ ధన్యమయింది గంగారామ్‌గారూ–"

"చాలా మంది ఇదే మాట అంటూంటారు–"

"గంగారామ్ గారూ! మన దేశంలో షుమారు నూటికి తొంభయ్‌మంది నేరస్థులు– అయ్‌మీన్ దొంగలు– పోలీస్‌లకు దొరక్కపోవటం చాలా మామూలు విషయం కదా! మరి మీరంత ఓవర్‌గా క్రెడిట్ ఎందుకు తీసుకుంటున్నారు?"

"సాధారణంగా దొంగలను పోలీసులు పట్టుకోలేకపోవడం చాలా మామూలు, సహజమయిన విషయం! కానీ నాలాగా ఇన్ని నేరాలు చేసి, దొరక్కుండా తప్పించు కున్నవాడినిక నేనొక్కడినే! అందుకని నేనే 'గిన్నిస్‌రికార్డ్' హోల్డరయాను."

"ఓహో! ఎంత బాగాచెప్పారు సార్! ఈ హైలెవల్ ట్రైనింగ్ సెంటర్ పెట్టటం చాలామంచి విషయమే! కానీ దొంగలనూ, రాజకీయనాయకులనూ ఎలా కలుపుతారు సార్? వాళ్ళు వేరూ, వీళ్ళు వేరుకదా?

అతను చిరాగ్గా చూశాడు.

"మీ జర్నలిస్ట్‌లకు కొంచెం ఇమేజినేషనుండాలయ్యా! రాజకీయ నాయకులు చేసేది, దొంగలు చేసేదీ ఒకటే పనికదా! దోచుకోవటం! రాజకీయనాయకులు ఇన్ డైరెక్ట్‌గా, ఓపెన్‌గా దోచుకుంటే, దొంగలు డైరక్ట్‌గా – సీక్రెట్‌గా దోపిడీలు చేస్తారు.

ఎటొచ్చీ తేడా ఎక్కడొస్తుందంటే పోలీసులు వాళ్ళకి సెల్యూట్ కొడతారు– కానీ దొంగల్ని సెల్‌లో పడేస్తారు.

"మీరు చెప్పేది నాక్కొంచెం కన్‌ఫ్యూజన్‌గా ఉందిసార్!" రాజకీయనాయకుల దోపిడీ గురించి ఒక ఎగ్జాంపుల్ చెప్తారా?"

"మా యూనివర్శిటీలో జాయనవ కూడదూ? మొత్తం క్లియర్‌గా అర్థమవుతుంది."

"కానీ మేము ఆ రెండు కేటగిరీల్లోకీ రాలేము కద్సార్?"

అతనికి కోపం వచ్చింది.

"ఇదిగో! ఇలాంటి హిపోక్రసీయే నాకు నచ్చదు– మీ టి.వి.జర్నలిస్ట్‌లో ఎంతమంది బ్లాక్‌మెయిలర్స్‌ని చూపించను? కాళ్ళు చేసేది దోపిడీ కాదా? అంటే దొంగల కేటగిరీలోకే వస్తారు కదా?" పరువు పోయేట్లుందని నేను ట్రాక్ మార్చేశాను–

"రాజకీయనాయకులు చేసేది కూడా దోపిడీయే అనడానికి ఒక ఎగ్జాంపులేమయినా చెప్తారా సార్?" అడిగాను.

"లక్షణంగా చెప్తా– ఒకసారి ఒక మినిష్టర్ గారు అర్జంటుగా చీఫ్ ఇంజనీర్ని పిలిచాడు.

'ఇదిగో ఛీఫూ! నదులూ, కాలవల మీద బ్రిడ్జీలు కట్టడానికి మన డిపార్ట్‌మెంట్‌కి ఎలాట్ చేసిన తొమ్మిదివేల కోట్లూ ఖర్చయిపోయిందా లేదా?"

"అప్పుడు ఎక్కడ సార్! రేపుమార్చిలోగా ఇంకా మూడువేల కోట్లు ఖర్చుపెట్టాల్సి ఉంది. కానీ బ్రిడ్జీలు కట్టాల్సిన అవసరం ఎక్కడా కనబడటం లేదు– ఎవ్వరూ కావాలని కూడా అడగటం లేదు–"

మినిష్టర్ ఓ క్షణం ఆలోచించాడు.

"అయితే ఓ పనిచెయ్‌రా అబ్బాయ్– మా వూరి పంటకాలువ మీద ఒక బ్రిడ్జి కట్టెయ్– మొత్తం ఖర్చుయిపోద్ది–"

ఇంజనీరు ఉలిక్కి పడ్డాడు.

"ఒక్క బ్రిడ్జీ– అదీ పంటకాలువమీద కట్టేది – దానికి ఎంతఖర్చవుతుంది సార్– మహా అయితే యాభై కోట్లవుతుంది–" మినిష్టర్ చిరాకు పడ్డాడు.

'ఇదిగో ఎవుడయ్యా? నిన్ను చీఫ్ ఇంజనీర్‌గా చేసింది? నేననేది పంటకాలువకు అడ్డంగా కట్టే బ్రిడ్జీ కాదురా! పంటకాలవమీద, దానితో పాటు నిలువుగా, అంటే పారలల్‌గా బ్రిడ్జీకట్టరా! సముద్రం వరకూ కట్టుకుంటూ వెళ్ళాలంటే డెబ్భయ్‌వేల కోట్లయినా చాలవ్– ఎలావుంది మన ప్లాన్?"

ఇంతవరకూ చెప్పినా నా వంక చూశాడు గంగారాం–

"ఇప్పుడేమంటావ్? అది కూడా దోపిడీలో కొస్తుందా రాదా?"

"ఆహా! మీ నాలెడ్జీ అమోఘం సార్! ఇంతనాలెడ్జీ ఉందంటే మీరు చేసిన దొంగతనాలు, దోపిడీలు కూడా హైస్టాండర్డ్స్‌లో ఉండి ఉంటాయని నాకనిపిస్తోంది."

అతను గర్వంగా చూశాడు.

"అంతా రాజకీయ నాయకుల దయ అనుకో! ప్లస్ మా మహా గురువు వీరప్పన్, చార్లెస్ శోభరాజ్ లాంటి వారి అద్భుత చోరగాథల ఇన్‌స్పిరేషన్!

అందాకా ఎందుకు ఒకసారేం జరిగిందంటే పోలీసులు ఓ డజను దొంగతనాలకు సంబంధించి నన్ను అరెస్ట్ చేయడానికొచ్చినప్పుడు నేను నా అసిస్టెంట్‌కి నా వేషం వేసి – నేను ఆడదాని వేషం వేసుకుని తప్పించుకున్నా–"

"అంటే మీ అసిస్టెంట్‌కి జైలుశిక్ష పడిందామరి?"

"పడితే ఇంక నా గొప్పతనమేంట్రా? జడ్జిగారి ముందు వాడిని నిలబెట్టారు.

"ఏమోయ్! నువ్ పాతిక దొంగతనాలు చేసినట్లు రుజువయింది – శిక్షవేసేముందు నువ్ చెప్పుకునేదేమయినా ఉందా?" అనడిగారు జడ్జిగారు.

"ఉందిసార్!నిజానికి బైహార్ట్ నేను చాలా నీతి నిజాయితీగల వాడిని సార్! కానీ ఇదిగో నా కుడిచెయ్యి ఉంది చూశారూ? నేనెంత వద్దనుకున్నా దీనికి దొంగతనాలు చేయటం అలవాటయిపోయింది. అందుకని యువరానర్ – నేరం నాదికాదు – నా రైట్‌హాండ్‌ది–" నేనిచ్చిన ట్రైనింగ్‌తో డైలాగ్ కొట్టాడు మావాడు.

మావాడి అతి తెలివికి జడ్జి తనింకా అతి తెలివిగా డైలాగ్ కొట్టాడు.

"అడెడెడెడె! అయితే ఈ దొంగతనాలు నీ కుడిచేయి చేసింది గనుక నిన్ను వదిలేయమంటావ్ – అంతేనా?"

"ఆహా! నా మనసు ఎంత చక్కగా అర్థం చేసుకున్నారు సార్!"

"సరే ఓ పని చేస్తా! నిన్ను వదిలేస్తాను గానీ– ఇన్ని నేరాలకు పాల్పడిన నీకుడిచేతికి మాత్రం అయిదేళ్ళు కఠిన కారాగార శిక్ష విధిస్తున్నా! ఎలా వుంది నా జడ్జిమెంట్ లెవలు?" హాపీగా అడిగాడు జడ్జ్–

"అద్భుతమయిన జడ్జిమెంట్సార్– నాకుడి చేతికి ఆ మాత్రం శిక్ష పడాల్సిందేమరి. అయితే ఇదిగోండి సార్ నా కుడిచెయ్యి! దీన్ని జైల్లో పడెయ్యండి! అయిదేళ్ళ తర్వాత వచ్చి తీసుకుంటా' అంటూ తన జైపూర్ టైప్ చెయ్యి తీసి జడ్జ్ టేబుల్ మీదుంచి ఒంటి చేత్తో హాపీగా వెళ్ళిపోయాడు–"

నాకు తెలీకుండా నేను తప్పట్లు కొట్టాను –

"సూపర్బ్ అయిడియా సార్! యూ ఆర్ జీనియస్ "– అన్నాను.

"దాన్నేముందిగానీ – టెక్నికల్ నాలెడ్జ్ ఉపయోగించీ పోలీసులకు దొరక్కుండా ఒకసారి తప్పించుకున్నారా అబ్బాయ్"

'బాబ్బాబు– అదేంటో చెప్పండి సార్– మా జర్నలిస్ట్‌లకు ఇలాంటివి తెలీటం చాలా అవసరం సార్–"

"ఆరోజు అమావాస్య! వరుసగా నాలుగిళ్ళల్లో దొంగతనాలు చేసి నగలు, క్యాషూ, లాప్‌టాప్‌లూ అన్నీ పెద్దబాగ్‌లో వేసుకుని బాగ్ వెనుక వీపుకి – సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లాగా తగిలించుకుని వెళ్తోంటే గస్తీ తిరిగే కానిస్టేబుల్, ఒక ఇన్‌స్పెక్టర్ చూసి నన్ను ఛేజ్ చేయటం మొదలుపెట్టారు.

వీపుకున్న ఆ బరువుతో నాకు పరుగెత్తటం కష్టమయిపోతోంది. ఇంక వాళ్ళని దొరికి పోకతప్పదు అనుకుంటున్న టైమ్‌లో నాకు మీ జర్నలిస్ట్‌లు న్యూస్ పేపర్లలో రాసే కొన్ని వార్తలు గుర్తుకొచ్చినయ్.

ఏదయినా డెడ్‌బాడీ కనిపించినపుడు రెండు పోలీస్ స్టేషన్ల వాళ్ళు– అది మీ జూరిస్ డిక్షన్‌లో కొస్తుందంటే – కాదు మీ జూరిస్ డిక్షన్‌లో కొస్తుందని వాదులాడుకుని ఎవర్దారిన వాళ్ళు పోవటం గురించి మీరు అనేకసార్లు రాశారు. దాన్ని బట్టి

మాకర్థమయిందేమిటంటే – పోలీసులు ఛస్తే వాళ్ళ పోలీస్ స్టేషన్ జూరిస్ డిక్షన్ దాటి ఒక్కడుగు కూడా ముందుకేయరని!

అప్పటికే నన్ను వెంటాడుతున్న పోలీసులిద్దరూ వాళ్ళ పోలీస్ స్టేషన్ జూరిస్‌డిక్షన్ సరిహద్దులోకొచ్చిన విషయం చూసి ఠక్కున ఆగిపోయి వెనక్కు తిరిగా.

"రండ్రా! దమ్ముంటే పట్టుకోండి! మీది ఉప్పల్ పోలీస్‌స్టేషన్ లిమిట్స్‌రా! నేను నిలబడింది ఎల్బీనగర్ పోలీస్ స్టేషనల్ లిమిట్స్‌లో! దమ్ముంటే వచ్చి పట్టుకోండ్రా!" అంటూ అరచాను.

అంతే! వాళ్ళు సడెన్ బ్రేక్ వేసినట్లు ఆగిపోయారు.

"ఈసారికి తప్పించుకున్నావ్‌రా! ఇంకోసారి ఎట్లా దొరకవో చూస్తాం" అంటూ వెనక్కు తిరిగి వెళ్ళిపోయారు. ఇదీ టెక్నికల్ ఎస్కేప్ అంటే" అంటూ ముగించాడతను.

"ఆహా! మీ తెలివికి జోహార్లు సార్– కానీ నాదో డౌటుసార్–"

"ఏంటది?"

"మీకింత టెరిబుల్ నాలెడ్జీ ఉంది కదా! మరి మీ నాలెడ్జీతో చిన్నాచితకా దొంగలందరికీ ట్రైనింగిచ్చి – అసలు ఒక్క దొంగ కూడా పోలీసులకు దొరక్కుండా రక్షించవచ్చు కదా–"

"నేను అడిగినవాళ్ళందరికీ ట్రైనింగ్ ఇస్తూనే ఉన్నారా బాబూ! కాపోతే ఇంకేవేవో ఫాక్టర్స్ వల్ల మా వాళ్ళు దొరికిపోతున్నారు. ఫరెగ్జాంపుల్ మా శిష్యుడు నరసింహం మాంఛి ఎక్స్‌పర్టే! కానీ కేవలం వాళ్ళావిడ తెలివితక్కువతనం వల్ల తగ్గాల్సిన శిక్ష పెరిగి పోయి నానా చావూ ఛస్తున్నాడు–"

"ఏం జరిగింది గురూజీ?"

"నరసింహం భార్య సావిత్రి నిజంగానే సతీసావిత్రి టైప్! ఓ రోజు ఏడుస్తూ హోమ్ మినిస్టర్ దగ్గరకెళ్ళింది.

హోమ్‌మినిస్టర్ అసలే పబ్లిసిటీ క్రేజీటైప్! ఎప్పుడూ కనీసం రెండు టి.వి.చానెల్స్ కెమేరాలు లేందే ఒక్క పనిచేయడు.

వెంటనే టి.వి.కెమేరాలోకి చూస్తూ, సావిత్రిని ఓదార్చాడు.

"అరెరె! ఏడవకమ్మా! నీకే ప్రాబ్లమ్ ఉన్నా నేను సాల్వ్ చేస్తా! ఏం జరిగిందో చెప్పు!" అనడిగాడు కొంచెం జాలి నటిస్తూ.

"మా ఆయన చర్లపల్లి జైల్లో ఉన్నాడు సార్–"

"అలాగా? ఏం చేశాడు?"

"మామూలేసార్– మనందరం చేసేవే – దోపిడీలు – దొంగతనాలు."

"అలాంటి పనులు చేస్తే జైలు కెళ్ళకుండా ఎలా ఉంటాడుమరి?" అన్నాడు హోమ్‌మినిస్టర్.

"నేను కాదనడం లేద్సార్! కానీ ఆడిది చాలా డెలికేట్ హెల్త్ సార్!వాడింట్లో ఉన్నప్పుడయితే నేను రోజూ ఆడికి ఫ్రూట్‌జూస్‌లూ, ఫైవ్‌సార్ హోటల్లో లంచ్ ఇప్పించేదాన్ని! జైల్లో అవేమీ ఉండవ్ గద్సార్– లేకపోతే పోనీగానీ వాడితో ఇరవైనాలుగ్గంటలూ రెక్కలు విరిగేట్లు కష్టం చేయిస్తున్నారు సార్ జైలువాళ్ళు–

ఈ పదిహేను రోజుల్లో సగానికి సగం అయిపోయాడు సార్–"

హోమ్‌మినిస్టర్ ఎదురుగ్గా టి.వి.కెమెరా ఉండటంతో రెచ్చిపోయాడు.

"ఇప్పుడే జైలర్‌కి ఫోన్ చేసి అతన్తో అంత చాకిరీ ఎందుకు చేయిస్తున్నారో అడుగుతానుండు" అంటూ జైలర్‌కి డయల్ చేశాడు.

"ఏం జైలరూ! పాపం ఆ నర్సింహ అనే ఆర్డినరీ దొంగను రాత్రింబగళ్ళు పనిచేయించటమే కాకుండా నానా తిప్పలూ పెడుతున్నారట! ఏంటి సంగతి? అండమాన్‌కి ట్రాన్స్‌ఫర్‌లో వెళ్ళాలని ఉందా?"

జైలర్ నెత్తీ నోరూ కొట్టుకొని మొత్తుకున్నాడు.

"ఇదన్యాయం సార్! ఖైదీలతో అంత పనిచేయించాలంటే ముందు మేము నానా ఛావూ ఛావాలి కదండీ! వాళ్ళ కసలు ఒక్క పనిచెప్తే వట్టుసార్–"

హోమ్‌మినిష్టర్ షాక్ తిన్నాడు.

"ఏవమ్మా– జైలరు అట్టా చెప్తున్నాడు?" ఎవర్తోనూ ఇంతపని కూడా చేయించటం లేదంట–"

"భలేవారే సార్! ఆడు అబద్ధాలు చెప్పే రకం కాద్సార్– అర్ధరాత్రినుంచీ తెల్లారేవరకూ పాపం జైలుగదిలో నుంచి సొరంగం తవ్వాల్సి వస్తోందని నిన్న కూడా చెప్పాడు సార్–"

"ఆ సొరంగమా?" అంటూ హోమ్‌మినిష్టర్ గావుకేక పెట్టాడు.

అందుకని నేను చెప్పేదేంటంటే దొంగలతోపాటు వాళ్ళ ఫామిలీ మెంబర్స్ క్కూడా

ఫుల్‌ట్రైనింగ్ ఇవ్వాల్రా" అబ్బాయ్ – లేకపోతే చాలా రిస్క్‌లో పడిపోతాం! కానీ ఏమాట కామాటే చెప్పుకోవాలి బ్రదరూ! పోలీసులు మా టెక్నిక్‌ల కంటే ఎప్పుడూ కొంచెం వెనుకబడే ఉంటారు– అదే మాకు శ్రీరామరక్ష అనుకోండి"

"ఒక ఎగ్జాంపుల్ చెప్పకూడదూ?"

ఒకసారి నేను దొంగిలించిన కారుడ్రైవ్ చేసుకుంటూ వెళ్తోంటే పోలీసులు ఆపి ఓవర్ స్పీడ్ వెళ్తున్నందుకు రెండొందలు లంచం ఇమ్మన్నారు– నేను నాలుగొందలు ఇచ్చాను."

"అదేంటి! రెండొందలడిగితే నాలుగొందలిచ్చావ్?" ఆశ్చర్యంగా అడిగాడు కానిస్టేబుల్.

"మరేం లేద్సార్– అర్జంటు పనిమీద వెళ్తున్నాను. అంటే ఇక ముందు కూడా ఓవర్‌స్పీడ్ వెళ్ళాలి - అందుకని చేయబోయే తప్పుక్కూడా ముందే చలానా కట్టేస్తున్నానన్నమాట"

నా తెలివితక్కువతనం చూసి కానిస్టేబుల్ తెగ నవ్వుకున్నాడు.

"సరే– ఫో" అంటూ వదిలేశాడు.

దాంతో నేను హాపీగా – వెనుక నన్ను ఛేజ్ చేస్తున్న పోలీస్ జీప్‌కి దొరక్కుండా పారిపోయాను."

"ఆహా పోలీసుల వీక్‌నెస్‌ని బాగా కాష్ చేసుకున్నారు సార్–"

"ఒకసారి ఒక జడ్జీ వీక్‌నెస్‌ని కూడా కాష్ చేసుకున్నా బాబూ–"

"అదెలా జరిగింది సార్?"

జడ్జిగారి ముందు అమాయకంగా ఫేస్ పెట్టి తెగ ఓవరాక్షన్ చేశాను ముందు.

"సార్! ఒకప్పుడు అంటే పదేళ్ళ క్రిందట కొన్ని నేరాలు చేసిన మాట నిజమే సార్– కానీ ఆ తర్వాత 'గాంధి' సినిమా చూసి మారిపోయి కేవలం నిజాలే మాట్లాడుతూ, కష్టపడి జీవితం గడుపుతున్నా సార్– కానీ ఈ పోలీసులు నా పేరు మీద హిస్టరీ షీట్ ఉందని ఎక్కడే దొంగతనం జరిగినా అది నా మీదే వేసి మీ ముందు నిలబెడుతున్నారు సార్–"

జడ్జీ కొంచెం మెత్త బడ్డాడు.

"కానీ నువ్ దొంగతనం చేసినట్లు ఒకడు సాక్ష్యం చెప్తున్నాడు కదా మరి?"

జడ్జీకి 'సాక్షులు' అనే పాయింట్‌లో చాలా వీక్‌నెస్ ఉందని నాకు ముందే తెలుసన్నమాట–

"అంటే సాక్షులకు మీరు చాలా ప్రాముఖ్యం, గౌరవం ఇస్తారా సార్?"

"అవునోయ్ కేవలం సాక్ష్యాలమీద ఆధారపడే నా కెరియర్ అంతా సక్సెస్‌ఫుల్‌గా గడిపేశాను–"

"ఎంత అద్భుతమయిన అవగాహన సార్–అందరు జడ్జీలు మిమ్మల్నే ఎందుకు ఆదర్శంగా తీసుకోవటం లేదో నా కర్థం కాదు–"

జడ్జీ పొంగిపోయాడు.

"సరే సరే– ఇంతకూ నువ్ నేరం వప్పుకుంటున్నావా?"

"లేదు సార్"

"ఎందుకని?"

"నేను నిర్దోషినని ఎనిమిది సాక్షుల్ని తెచ్చుకున్నా సార్–" అంటూ మాపాత దొంగలగాంగ్‌ని లోపలకు పిలిపించా! అంతే! కేస్ కొట్టేశారు"

గంగారామ్ అసిస్టెంట్ హడావిడిగా వచ్చాడు.

"సార్! కరీంనగర్ నుంచి ఒక రాజకీయనాయకుడొచ్చాడు సార్. ఆయన దొంగనోట్లు ప్రింట్ చేసే వ్యాపారమంట. ఒకవేళ పోలీస్‌కేస్ అయితే తప్పించుకోవటం ఎలాగో మన యూనివర్శిటీలో చేరి ట్రైనింగ్ తీసుకుంటారంట–"

"ఫీజు లక్షరూపాయలని చెప్పావా?"

"చెప్పగానే రెండులక్షలు దొంగనోట్లు ఇచ్చేశాడు సార్?"

"ఆ!"